క్లుప్తంగా

ఘనంగా లఘు కల్యాణం



లఘు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్లకు ఆశ్వయుజ మాస చిన్న కల్యాణ(లఘు కళ్యాణం) మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ వైష్ణవ ఆగమానుసారం స్వామి వారి కల్యాణ మండపం నందు భీమవరానికి చెందిన మరంగంటి ఝాన్సీ లక్ష్మి వారి కుమారులచే స్వామివారికి అర్చకులు వేద పండితులచే వేదమంత్రాలు నడుమ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారి కల్యాణ మహోత్సవం తిలకించారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు



కొమరాడలో సోమకుమార్‌ను అదుపులోకి తీసుకున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. బలరామరాజు తన సిబ్బందితో కొమరాడలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కోడి సోమకుమార్‌పై దాడి చేసి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఎస్సైలు పీవీవీఎస్ ఉమా మహేశ్వరరావు, పి. సునీల్ కుమార్‌లు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోషేనురాజును మర్యాద పూర్వకంగా కలిసిన ప్రభు



భీమవరంలో మోషేనురాజును కలసిన ప్రభు

భీమవరం: వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ రైట్ టు ఇన్ఫర్మేషన్ (ఆర్‌టీఐ) విభాగం రాష్ట్రసెక్రెటరీగా నియమితులైన భీమవరం పట్టణానికి చెందిన గుంటి ప్రభు సోమవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజును మర్యాద పూర్వకంగా కలిశారు. భీమవరంలోని మోషేనురాజును క్యాంపు కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా పార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, భీమవరం నియోజకవర్గం సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు, స్టేట్ ఎగ్జిక్యూటివ్‌కౌన్సిల్ సభ్యుడు మేడిది జాన్సన్ తదితరులను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వాతి

కాళ్ల: ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది అని ఎంపీడీవో స్వాతి తెలిపారు. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థూలకాయానికి నివారణకు చక్కెర నూనె తగ్గించాలని తెలిపారు. సమన్వయ చర్యలు డిజిటలికరణ ద్వారా బలమైన పోషణకు బలమైన అడుగని స్పష్టం చేశారు. శిశు చిన్న పిల్లల అలవాట్లు గురించి అవగాహన కల్పించారు. సీడీపీఓ వి విజయరత్నం, సూపర్ వైజర్లు కృష్ణకుమారి, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయాలి



ఆర్‌అండ్‌బీ ఈఈకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: వీరవాసరం మండలంలో అత్యంత దారుణంగా చెరువులను తలపించేలా ప్రమాదకరంగా ఉన్న రోడ్లుకు మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని సీపీఎం జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ జుత్తిగ నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్‌అండ్‌బీ ఈఈ అడబాల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం నర్సింహమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ ఆర్ అండ్ బి రోడ్లు యుద్ధప్రాతిపదికన నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. మండల కన్వీనర్ బొర్రా తదితరులున్నారు.

ఆ రహదారులు.. మృత్యు లోగిళ్లు

అధ్వానంగా ఉన్న అప్పారావుపేట, పెదకాపవరం రోడ్లు



ఆకివీడు: గుమ్ములూరు-అప్పారావుపేట మార్గంలో అడుగు మడుగులతో ఉన్న రహదారి



ఆకివీడు: దుక్కి వర్షానికే పెదకాపవరం-క్రొవ్విడి కేజీ రహదారి దుస్థితి

ఆకివీడు: అవి మృత్యు రహదారులుగా మారాయి. అడుగులతో మడుగులతో నిండిపోయాయి. నిధులున్నా అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసిన నేటి పాలకులు తమ ఏడాదిన్నర పాలనలో ఇటువంటి గుంతల్ని మరింతగా పెంచుతున్నారని ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. తాత్కాలిక మాట్లు చేసిన రోడ్లు కూడా ధ్వంసమైపోయాయి. నియోజకవర్గంలోని పలు చోట్ల రోడ్లు దుస్థితి అధ్వానంగా ఉండగా ఆకివీడు మండలంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా తయారైంది. మండలంలోని గుమ్ములూరు-అప్పారావు పేట రోడ్డుకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరు అయినప్పటికీ కూటమి ప్రభుత్వంలో ఒక్క పార మట్టి వేసిన పాపాన పోలేదు. దీంతో ఈ రహదారి భారీ గుంతలతో మృత్యులోగిళ్లుగా మారింది. అప్పారావు పేట ప్రజలు ఆకివీడు వచ్చేందుకు దగ్గరి మార్గంగా ఉన్న గుమ్ములూరు వైపు రోడ్డు అడుగడుగునా అడుగు మడుగులతో నిండి ఉంది. ఆ ప్రాంత ప్రజలు ద్విచక్ర వాహనాలపై కాదు, నడిచి వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. చేపలు, రొయ్యల చెరువులకు మేత తరలించేందుకు, పిల్ల తీసుకువెళ్లేందుకు వాహనాలు రావడం ఇబ్బందికరంగా ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలో ఒక మూలగా ఉన్న అప్పారావు పేట గ్రామ ప్రజలు బయట ప్రపంచాన్ని చూడాలంటే ఈ రోడ్డుపై నుంచి గుమ్ములూరు రావాల్సి ఉంది.

పెదకాపవరం-క్రొవ్విడి రోడ్డు అంతే..

మండలంలోని పెదకాపవరం-క్రొవ్విడి, పాములపర్రు-కొల్లేరు రోడ్ల దుస్థితి కూడా చినుకు పడితే నడవలేని దుస్థితిలో ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. చెరువుల్ని తలపిస్తున్నాయి. ఆకివీడు నుంచి గణపవరం వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఉన్న కేజీ రహదారి మరీ అధ్వానంగా మారడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరి కొద్ది రోజులు ఇదే విధంగా రహదారి ఉంటే ఈ రోడ్డును ప్రజలు మరిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందటున్నారు. ఈ రహదారులకు కూడా కేంద్ర రోడ్డు నిధులు(సీఆర్‌ఎఫ్)మంజూరు అయ్యాయి. రూ. 52 కోట్ల మేర నిధులు మంజూరు అయినప్పటికీ రోడ్డు నిర్మాణాన్ని ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని, అధికారులు ఈ రోడ్డువైపే చూడటంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వెళ్లిపోయి శీతాకాలం వస్తున్నా రోడ్డు పునఃనిర్మాణానికి అధికారులు ఏవిధమైన చర్యలూ తీసుకోవడం లేదని వాపోతున్నారు.

కృత్రిమ మేధస్సుదే భవిష్యత్

విద్యార్థులు నూతన సాంకేతిక పరికరాలపై అవగాహన పొందాలి



సాఫ్ట్‌వేర్ ట్రైయినర్ కె.మురళీ కృష్ణ సన్మానిస్తున్న దృశ్యం

ఆకివీడు: ఆధునిక సాంకేతిక విప్లవంతో ప్రపంచం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోందని ప్రముఖ సాఫ్ట్‌వేర్ ట్రైయినర్ కె.మురళీ కృష్ణ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత అధ్యక్షత వహించారు. మురళీ కృష్ణ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు కంప్యూటర్ విప్లవంలో, భవిషత్ సాంకేతిక రంగంలో దూసుకుపోనుందన్నారు. విద్యుర్థులు మెరుగైన భవిష్యత్ పొందడానికి ఏఐ సాంకేతిక పరిజ్ఞానంపై విద్యాభ్యాసనాన్ని కొనసాగించాలన్నారు. అవగాహనతో పాటు, విజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్‌లో మంచి అవకాశాలు పొందవచ్చునన్నారు. ఏఐ పరిజ్ఞానం, పరికరాలు, రెజ్యూమ్ తయారీ, కంటెంట్ తయారీ, పీపీటీ తయారీలో చాట్‌జీప్ట్, పర్‌ప్లెక్సిటీ వంటి సాధనాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఏఐ కీలక మార్పుల్ని తీసుకువస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కమీషన్ పెంచాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

పాలకోడేరు: తమకు ఇచ్చే రూపాయి కమీషన్‌ను మూడు రూపాయలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ మేరకు పాలకోడేరు మండల తహసీల్దార్ ఎస్.భారతీ విజయలక్ష్మికి సోమవారం రేషన్ డీలర్స్ అసోసియేషన్ వినతిపత్రం సమర్పించారు. ఎండీయూ ఆపరేటర్ల నుంచి రేషన్ షాపులను తమకు అప్పగించిన తర్వాత 65+ వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకును ప్రభుత్వ ఆదేశాల మేరకు సొంత ఖర్చులతో డోర్ డెలివరీ చేస్తున్నామని, ఇంతవరకు తమకు ఎలాంటి రెమ్యునరేషన్ మంజూరు చేయలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఇస్తున్న కిలోకు రూపాయి కమిషన్ ఇప్పుడు కూడా ఇస్తున్నారని, పెరిగిన ధరల దృష్ట్యా మూడు రూపాయలకు పెంచాలని కోరారు. 15వ తేదీ వరకు రేషన్ తీసుకోవచ్చని ప్రభుత్వం ప్రచారం చేస్తూ రోజురోజుకూ పర్సంటేజీలు టార్గెట్ పెడుతున్నారని, దీనివల్ల తమకు మానసిక వత్తిడి పెరిగిపోయిందని, ప్రశాంత వాతావరణంలో పంపిణీ చేసేలా పరిస్థితులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయి రామకృష్ణ, విజయరత్నం, ఉష, సుజాత, హైమ, ఆనందం నాగలక్ష్మి, నవీన్, మునీశ్వరరావు, చినబాబు, జల్లూరి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి గ్రామోత్సవం



అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మాదివాడలో దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో సోమవారం గ్రామోత్సవాలు నిర్వహించారు. వీరవాసంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలోనూ, తోలేరులో ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయంలోనూ, రాయకుదురు, కొణితివాడ, మడుగు పోలవరం ,అండలూరు, తోలేరు, చింతలకోటి గరువు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, బాలేపల్లి, మెంటేపూడి, దూసనపూడి, పెరికిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మేళ తాళాలుతో బాణాసంచా కాలుపులు మధ్య ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రత్యేక విగ్రహాలు సోమవారం విచిత్ర అలంకరణలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, గరగ నృత్యాలు, శక్తి వేషాలు, డీజే సౌండ్స్‌తో యువత కేరింతలతో ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో ఊరేగింపు భక్తులను ఎంతో ఆకట్టుకుంది.

ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలి

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో ముఖ ఆధారిత హాజరు.



చినపుల్లేరులో ఉపాధిహామీ కూలీలకు ఈకేవైసీ చేయిస్తున్న టీఏ ఒమేగారాజు

ఉండి: ఆధునీకరించిన సాంకేతికత ద్వారా ఎన్ఆర్ ఈజీఎస్ పనులలో అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేసే కూలీలకు ముఖ ఆధారిత హాజరు వేసేందుకు ప్రతీ కూలీ ఈకేవైసీ చేయించుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ టీఏ ఒమేగారాజు తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం చినపుల్లేరు, పెదపుల్లేరు గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలకు ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా టీఏ మాట్లాడుతూ ఇక నుండి ఉపాధిహామీ పనులకు వచ్చే ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో పనికి వచ్చినా హాజరు నమోదు కాకుండా పోతుందని తెలిపారు. ఉపాధి హామీ ప్రక్షాళనలో భాగంగా ఎక్కడా మస్తర్లులో తేడాలు, హాజరులో తేడాలు రాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాబట్టి ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు.

లయన్స్ భారతీయుల ఆత్మీయత మరువలేనిది



లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఆఫ్రికన్ లైనర్

ఆకివీడు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ప్రాజెక్టులను సోమవారం సందర్శించి భారతీయుల ఆత్మీయత మరువలేనిదని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్స్ నడినె బూషల్(వెస్టిండీస్) అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆమె చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చెక్కులు అందజేసారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి సుభాష్‌బాబు పాల్గొన్నారు. దాతలు ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ పాపారావునాయుడు, ఫస్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు, రెండవ వైస్ గవర్నర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు, మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ మేకా శ్రీరామసురేష్, జిల్లా కేబినెట్ కార్యదర్శి ఎస్ కామేశ్వరరావు, జిల్లా కేబినెట్ కోశాధికారి కారుమూరి రామలింగేశ్వరరావు, ఉపేంద్ర, కోశాధికారి పెన్మత్స వెంటజగన్నాథ్‌రాజు, రుద్రరాజు నరసరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

యనమదుర్రు డ్రెయిన్‌పై అప్రోచ్ రోడ్లు నిర్మించాలి



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

భీమవరం: యనమదుర్రు డ్రెయిన్‌పై భీమవరం పట్టణం, గొల్లవానితిప్ప, నాగేంద్రపురం గ్రామాల్లో నిర్మించిన వంతెనకు దశాబ్ద కాలంపైగా అప్రోచ్ రోడ్లను వేయకపోవడం పాలకుల నిర్లక్ష్యవైఖరికి నిదర్శమని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు అన్నారు. అప్రోచ్‌రోడ్ల నిర్మాణం, భీమవరం పట్టణంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేసిన అనంతరం రంగారావు విలేకర్లతో మాట్లాడారు. యనమదుర్రు డ్రెయిన్‌పై 14 ఏళ్ల క్రితం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి వంతెనలు నిర్మించారని అయితే వాటికి ఇప్పటి వరకు అప్రోచ్ రోడ్లు వేయకపోవడంతో వంతెనలు నిరుపయోగంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మంత్రిని కలసిన వారిలో సీపీఐ నాయకులు వైవీఆనంద్, ఎం లక్ష్మీపతి, అద్దంకి రాజేష్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను అరెస్టు చేయాలి

నరసాపురం రూరల్: చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవళంపేట సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత ఐక్య వేదిక రాష్ట అధ్యక్షుడు గంటా సుందర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలోని ఐక్యవేదిక ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడం కుల దురహంకారం చేయడమే నన్నాయన అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దారుణం అన్నారు. సమావేశంలో పెట్టా రామారావు, ఎం సోమయ్య, కాటన్ చంటి, తాతారావు, చవ్వాకుల నాని తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే ప్రారంభమైన ప్రైవేట్ విద్యాసంస్థల ప్రవేశాల దందా

- తమ విద్యాసంస్థలో చేర్పించాలంటూ తల్లిదండ్రులకు వేధింపులు
- జిల్లాలో 126 జూనియర్ కళాశాలలు వాటిలో 107 ప్రైవేటు కళాశాలలే
- టెన్త్‌లో 540 మార్కులు వస్తే భారీగా ఫీజు రాయితీ అంటూ ఒత్తిడి
- వాహన సదుపాయం, ల్యాబ్‌లంటూ ప్రచారం
- ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి విద్యార్థుల జాబితా సేకరణ

భీమవరం: జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు అప్పుడే అడ్మిషన్స్ దందా ప్రారంభించాయి. ప్రత్యేక ఆఫర్స్ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఊదరగొడుతున్నారు. ఆలూ లేదు సూలు లేదు..కొడుకుపేరు అన్న చందంగా ప్రైవేట్ కళాశాల తీరు. రాష్ట ప్రభుత్వం అన్నిపరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించకముందే బాగా చదివే విద్యార్థుల జాబితా తయారు చేసుకుని తమ విద్యాసంస్థలో చేరాలంటూ ప్రత్యేక ప్రచారం ప్రారంభించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ప్రభుత్వ విద్యాసంస్థలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి మనబడి నాడు-నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయాలు ఖర్చు చేసిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పూర్తిస్థాయిలో మౌలికసదుపాయాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాసంస్థల పట్ల మక్కువ చూపారు. నేటి కూటమి ప్రభుత్వం విద్యాసంస్థలకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తమ హవా కొనసాగించేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో సుమారు 1,800 వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలున్నట్లు అంచనా. వాటిలో సుమారు 126 ఇంటర్మీడియట్ విద్యాసంస్థలకు గాను, 15 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్, రెండు సోషల్‌వెల్ఫేర్ కళాశాలలు, 107 ప్రైవేట్ విద్యాసంస్థలున్నాయి. వీటిలో దాదాపు 19,700 మంది విద్యార్థులకు గాను 16,650 మంది విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థల్లోనే విద్యనభ్యసిస్తున్నారు.

● ప్రచారం ప్రారంభించిన ప్రైవేట్ జూనియర్ కళాశాలలు

ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరిలో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించడంతో జిల్లాలోని అనేక ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వెంటబడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లోని టెన్త్‌లో మెరిట్‌స్టూడెంట్స్ జాబితాను ఆయా విద్యాసంస్థల నుంచి తీసుకుని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేర్పించాలంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం ప్రారంభించారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతోపాటు ల్యాబ్‌లు ఉన్నాయంటూ తమ కళాశాలలో చదివితే మెడిసిన్, ఇంజరీంగ్ సీట్లు ఖాయమంటూ నమ్మబలుకుతూ చేర్పించాలని పట్టుబడుతున్నారు. అంతేగాకుండా టెన్త్‌లో 540 మార్కులకు పైగా వస్తే ఫీజులో భారీ రాయితీ లిస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులను తమదారిలోనికి తెచ్చుకోడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. తమ కళాశాలకు బస్ సౌకర్యంతో పాటు ప్రభుత్వ అమలు చేస్తున్న తల్లికివందనం పథకం వర్తిస్తుందంటూ ప్రచారం ప్రారంభించారు. కళాశాలల యాజమాన్యాల ప్రోత్సహంతో కొంతమంది బృందాలుగా ఏర్పడి ఇంటింటికి తిరుగున్నారు. అయితే ఇంకా పదో తరగతి పరీక్షలు షెడ్యూల్ ప్రకటించకముందే ప్రైవేట్ విద్యాసంస్థల వేధింపులు ఏమిటంటూ విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల విద్యా వ్యాపారాన్ని ప్రభుత్వం కట్టడి చేయకుంటే ప్రభుత్వ విద్యాసంస్థలు పూర్తిగా మరుగునపడే ప్రమాదమేగాకుండా ప్రైవేటు విద్యాసంస్థల మాయాజాలంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల అప్పుల ఊబిలో కూరుకుపోతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా వేదికకు ఐదు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు సోమవారం ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ బాబూరావు చెప్పారు. గుమ్ములూరు గ్రామంలో 2.39 ఎకరాల విస్తీర్ణంలోని చేపల చెరువు ఉందని, రీ సర్వేలో విస్తీర్ణం తగ్గడం వల్ల మళ్లీ సర్వేచేయాలని సన్నిధి సత్యవతి ఫిర్యాదు చేశారన్నారు. ఇంటి నివేశన స్థలం కొరకు, తాళ్లకోడులో తను నిర్మించుకున్న భవనంలో తనకు స్థానం లేకుండా తన భర్త కొట్టి ఇంటి నుంచి నెట్టివేశారని మేకా సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారని చెప్పారు. మాదివాడ రెవెన్యూ గ్రామంలో పుంత రోడ్డు ఆక్రమణలకు గురైందని, సర్వే చేయించాలని, పరిమితికి మించి స్థలాని రిజిస్ట్రేషన్ చేయించుకుని, నా స్థలాన్ని ఆక్రమించిన స్థలంను సర్వే చేయించాలని స్థానికులు ఎండీ. నిజాముద్దీన్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వేణు



ఆర్టీసీ డిపో మేనేజర్ వై వేణు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వై వేణు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు ఆర్టీసీ స్టోర్ నుంచి బదిలీపై ఆయన భీమవరం వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి రిటైర్ కావడంతో ఆయన స్థానంలో వేణు డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

9,10 తేదీలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ఉండి: ఈ నెల 9, 10 తేదీల్లో మండలంలోని అందరు సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీవీఎస్ రెడ్డి పత్రికా ప్రకటనలో సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీలకు మొత్తం 22 మంది గ్రేడ్ -, గ్రేడ్-4 కార్యదర్శులు మొత్తం మీద 44 మంది ఉన్నారని తెలిపారు. కాబట్టి అందరూ ప్రజాప్రతినిధులు, అధికారులు రెండురోజులు తప్పనిసరిగా నూటికి నూరుశాతం హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో తెలిపారు.

ఉండిలో రీసర్వేపై గ్రామ సభ

ఉండి: మండలంలోని ఉండి గ్రామ సచివాలయం వద్ద సోమవారం రీసర్వేపై రైతులతో అధికారులు గ్రామ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో రైతులు రీసర్వేలో ఏవైనా తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వాటిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు.గ్రామానికి చెందిన పలువురు రైతులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తాడేరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

భీమవరం అర్బన్: తాడేరు విశాల సహకార పరపతి సంఘం త్రి సభ్య కమిటీ సోమవారం మండలంలోని కరుకువాడ బేతపూడిలోని ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో ప్రమాణ స్వీకారం సోమవారం చేశారు. చైర్మన్‌గా కొట్టు సురేష్, డైరెక్టర్లుగా జవ్వాది వెంకటేశ్వరావు, కొత్తపల్లి ధైర్య తేజలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్య సభ సభ్యుడు పాకా సత్యనారాయణ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రం ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పంచారామ క్షేత్రం ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ధర్మకర్తల మండల చైర్మన్‌గా చింతలపాటి బంగారు రాజు, ధర్మకర్తల్ల మండల సభ్యులుగా బ్రహ్మ జ్యోతుల సత్య ప్రసాద్, పాల వెంకట రామకృష్ణ, బండి రమణ, కొప్పర్తి విజయకుమార్, బొచ్చ కృష్ణవేణి, సాయి నాగేంద్ర, విజయలక్ష్మి కుమారి, పాట్నూరి శ్యాం కుమార్, పడమటి లీల, యార్లగడ్డ రమేష్, పెద్దింటి జ్యోతిర్మయి ఎక్స్ అఫీషియో సభ్యులు కందుకూరి సోమేశ్వరరావులు ప్రమాణస్వీకారం చేశా రు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, దేవస్థానం కార్య నిర్వహణ అధికారి డి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.